

అమలాపురంలో నిర్వహించిన ఊరేగింపులో శ్రీదేవి అమ్మవారి ప్రతిమ

కల్పవల్లీ.. వీడ్కోలు



సంప్రదాయ వాయిద్యాలు.. భక్తుల సందడి

దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా అమలాపురం పట్టణంలోని శ్రీదేవి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారుల మీదుగా విద్యుత్తు అలంకరణలు, సంప్రదాయ నృత్యాలు, కేరళ వాయిద్యాల నడుమ ఈ వేడుక సాగింది. వేలాది భక్తులు నిమజ్జన క్రతువులో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలి

అమలాపురం కలెక్టరేట్: ఎస్జీటీల్లో డిప్యుటేషన్ ప్రాతిపదికన చేపడుతున్న ఉపాధ్యాయుల భర్తీలో పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుబ్బారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జడ్పీ ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని పరిమితులు విధించడం సరికాదన్నారు.

సహకారం.. సాంకేతిక అస్త్రం

- పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు చర్యలు
- 298 కేంద్రాల కంప్యూటరీకరణకు కసరత్తు

ఈనాడు, కాకినాడ

బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు.. వందల కోట్ల కుంభకోణాలు.. లెక్కలేనన్ని తప్పులు..ఇదీ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి. కంప్యూటర్ యుగంలోనూ ఆర్థిక లావాదేవీలన్నీ కాగితాల రూపంలో జరగడమే కారణం.. దీంతో పీఎస్‌సీఎస్‌ల ప్రక్షాళనకు కేంద్రం ఉపక్రమించింది. కంప్యూటరీకరణ ద్వారా వ్యవస్థలను అనుసంధానం చేసి.. పత్రరహిత పాలనతో అక్రమాలకు అడ్డకట్ట వేయనుంది.


కాకినాడలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) పరిధిలోని 52 శాఖల్లో సాంకేతికతతో ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాల్లోని 298 పీఏసీఎస్‌లలో నేటికీ లావాదేవీలు, రుణాల వివరాలు కాగితాల రూపంలోనే భద్రపరుస్తున్నారు. రాష్ట్ర, జిల్లా సహకార బ్యాంకులతో పీఏసీఎస్‌లు అనుసంధానం కాక.. రోజువారీ వ్యవహారాలపై పర్యవేక్షణ కష్టమవుతోంది. దీంతో తప్పుడు పత్రాలు జతచేసి రుణాలు పొందడం వంటి అక్రమాలు జరిగాయి.

ఇప్పటికీ కాగితాల రూపంలోనే..

◆ ఉమ్మడి జిల్లాలో 148 పీఏసీఎస్‌లు నష్టాల్లో ఉన్నాయి. రూ.949.98 కోట్ల రుణాలు గడువు మీరినా చెల్లించని పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం డీసీసీబీపై పడింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.248.26 కోట్ల నష్టాన్ని చవిచూసింది. పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం నుంచి రూ.300 కోట్లు, నాబార్డు నుంచి 3 శాతం వడ్డీకి రూ.500 కోట్ల రుణాన్ని డీసీసీబీ కోరింది. 2029 నాటికి వ్యవస్థను లాభాల్లోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది.



అమలాపురం: రోళ్లపాలెం పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ పనులు



● పైలట్ ప్రాజెక్టు కింద..

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానానికి చర్యలు చేపట్టింది. పైలట్ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లాలో నరవ, గొల్లప్రోలు.. కోనసీమలో వీరవల్లిపాలెం, అమలాపురంలోని కేవీరావు పీఏసీఎస్, తూర్పులో తొర్రేడు..అల్లూరి జిల్లాలో ఇందుకూరు పేట పీఎస్‌సీఎస్‌లను ఎంపికచేసినా ఏవీ కొలిక్కిరాలేదు. వీటితోపాటు అన్ని సంఘాల కంప్యూటరీకరణను మరో 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేయొచ్చు



పీఏసీఎస్‌లలో పత్ర రహిత సేవలతో.. అక్రమాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. సాంకేతికతతో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది. ఏరోజుకారోజు లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేసి పరిస్థితి సమీక్షించొచ్చు. పీఏసీఎస్‌లకు కంప్యూటర్, 13 రకాల పరికరాలు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలో డేటా ఎంట్రీ 70 శాతం పూర్తయింది. కంప్యూటరీకరణ నెలాఖరుకు కొలిక్కివస్తుంది. **-ఆర్.వి.నరసింహారావు, సీఈవో, డీసీసీబీ**

ఇసుక.. మరో 10 రోజులు ఆగాల్సిందే

ఈనాడు, రాజమహేంద్రవరం: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి నదుల్లోని ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ఆరంభమైనప్పటికీ ఉమ్మడి జిల్లాలో మాత్రం ప్రతిబంధకాలు తప్పలేదు. రీచ్‌లు గుర్తించిన ప్రాంతాల్లో గోదావరి నదీ ప్రవాహం అధికంగా ఉండడం.. మనుషులతో తవ్వి, తరలించే పరిస్థితులు లేకపోవడమే దీనికి కారణం. ప్రస్తుతం తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో 28 రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 19 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనా. తవ్వకాలకు మరో పది రోజులు సమయం పట్టే అవకాశముంది.



నదీ ప్రవాహంతో తవ్వకాలకు ప్రతిబంధకాలు

కోనసీమలో 12 రీచ్‌లు..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. పులిదిండి, నార్కేడుమిల్లి, వడ్డిపర్రు-1, 2, అంకంపాలెం, పొడగట్లపల్లి -1, 2, ఆత్రేయపురం, ఊబలంక-1, కపిలేశ్వరపురం, ఆలమూరు, తాతపూడిలో ఈ రీచ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సేకరణ చేయొచ్చని అంచనా. జలతాకిడితో తవ్వకాలు ప్రారంభంకాలేదని, ఈ నెలాఖరులోగా మొదలయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ■ పొడగట్లపల్లి, అంకంపాలెంలో 5 హెక్టార్లకు పైబడిన విస్తీర్ణంలో సెమీ మెకనైజ్డ్ విధానంలో ఇసుక తవ్వకాలకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. స్థానికుల నుంచి సమ్మతి రావడంతో ఆ నివేదికను ఎస్ఈఐఏఏకు పంపించారు. అటునుంచి నిరభ్యంతర ధ్రువీకరణ వచ్చింది. పర్యావరణ అనుమతులతోపాటు సీఎఫ్ఈ, సీఎఫ్‌వో సమ్మతి కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేస్తే గరిష్ఠంగా నెల రోజుల్లో ఈ రెండుచోట్ల రీచ్‌లు అందుబాటులోకి రావొచ్చు.

మూడుచోట్ల ఆగిన టెండర్లు

■ తూర్పులో ఇటీవల 17 రీచ్‌లకు టెండర్లు పిలవగా సరిహద్దు సమస్యతో ఒకటి, సాంకేతిక కారణాలతో రెండుచోట్ల మినహా మిగతాచోట్ల ప్రక్రియ పూర్తిచేశారు. వేమగిరి, వానపల్లి-1, 2, ములకల్లంక, కాటవరం-1, ముక్కామల, కాకరపర్రు, తీపర్రు-2, 3, పెండ్యాల-కానూరు, పందలపర్రు, జీడిగుంట, చిడిపి, కుమారదేవం-1, 2, 3, వేగేశ్వరపురం రీచ్‌లను తవ్వకాలకు ఖరారు చేశారు. వీటి ద్వారా రోజుకు 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సేకరణ చేయొచ్చు. ■ ఈ జిల్లా పరిధిలోని 9 రీచ్‌ల్లో బోట్స్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో తవ్వకాలు చేస్తుండగా రోజుకు 13 వేల మెట్రిక్ టన్నులు వస్తోంది. ఇది సరిపోవడం లేదు. పెండ్యాల నిల్వకేంద్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది.

తుని రైల్వేస్టేషన్‌లో మంటలు

ఆందోళనకు గురైన ప్రయాణికులు



ప్లాట్‌ఫామ్‌పై మంటల వ్యాప్తి..

తుని: తుని రైల్వే స్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫామ్‌పై బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. సాయంత్రం 5.45 గంటల సమయంలో ప్లాట్‌ఫామ్ ఫ్లోరింగ్‌పై భూగర్భ విద్యుత్తు తీగలకు సంబంధించి షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే సమయంలో విశాఖపట్నం వెళ్లే జన్మభూమి రైలు రావడం.. హడావిడిలో ఉన్న ప్రయాణికులు ఈ మంటలు చూసి పరుగులు తీశారు. రైల్వే ఎలక్ట్రికల్ విభాగ సిబ్బంది మంటలు ఆర్పేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగలేదని స్టేషన్ సూపరింటెండెంట్ రఘునాథ్ బెహ్రా తెలిపారు.

నయా కిక్కు

- ■ తెరుచుకున్న మద్యం దుకాణాలు
- ■ ఉమ్మడి జిల్లాలో రూ.27.80 కోట్ల సరకు విక్రయాలు

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లైసెన్సులు దక్కించుకున్నవారంతా బుధవారం నుంచి దుకాణాలను ప్రారంభించారు. తమకు అవసరమైన సరకును నిర్దేశిత ఐఎంఎల్ డిపోల నుంచి తీసుకువచ్చారు. 375 దుకాణాల నుంచి వచ్చిన ఇండెంట్ల ఆధారంగా రాజమహేంద్రవరం, సామర్లకోట, అమలాపురం, చాగల్లులోని డిపోల నుంచి సుమారు రూ.27.80 కోట్ల విలువైన మద్యం సరఫరా చేశారు. అందుబాటులో ఉన్న నిల్వలు, గిరాకీ ఆధారంగా దాదాపు 40 వేల కేసుల మద్యం (కేసుకు 9 లీటర్లు) అందించారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాకపోవడంతో షామియానాలు ఏర్పాటుచేశారు.



అమలాపురంలోని ఎర్రవంతెన వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన దుకాణం

రద్దీ వాతావరణం..

● రాజమహేంద్రవరంలోని ఐఎంఎల్ డిపో నుంచి బుధవారం 74 దుకాణాలకు రూ.6.73 కోట్ల (లిక్కరు 7393, బీర్లు 2164 కేసులు) విలువైన మద్యం సరఫరా చేశారు. ఇక్కడి నుంచే కోనసీమ జిల్లా పరిధిలోని 42 దుకాణాలకు సైతం పంపిస్తున్నారు. ● చాగల్లు డిపో పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలో 42, ఏలూరు-28, భీమవరానికి చెందిన 40 దుకాణాలున్నాయి. ఇక్కడి నుంచి బుధవారం రాత్రి 9 గంటల వరకు 96 దుకాణాలకు రూ.4.20 కోట్ల విలువైన మద్యం కేసులు సరఫరా చేశారు. ● కాకినాడ జిల్లా పరిధిలో 155 దుకాణాలుండగా 118 దుకాణాలకు రూ.11.28 కోట్ల (లిక్కరు 11,797, బీర్లు 5458 కేసులు) విలువైన మద్యం పంపించారు. ● అమలాపురం డిపో పరిధిలో 92 దుకాణాలుండగా 72 దుకాణాలకు రూ.5.6 కోట్ల (లిక్కరు 6056, బీర్లు 1956 కేసులు) విలువైన మద్యం విక్రయించారు. సాంకేతిక సమస్య కారణంగా అందరికీ సరకు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ● కొన్ని దుకాణాల్లో గత ప్రభుత్వానికి చెందిన బ్రాండ్లను రూ.150 నుంచి రూ.220 చొప్పున విక్రయించడంపై కొందరు ప్రశ్నించారు. మద్యం డిపోల్లో ఇప్పటికీ పాత స్టాకు ఉండడం, కొత్త బ్రాండ్లు కూడా రావడంతో ఇలా జరిగి ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

కవలలపై మృత్యుకాటు

రసాయనాల ట్యాంకులో పడి అన్న.. కాపాడేందుకు దిగి సోదరుడు మృతి

ఈనాడు- హైదరాబాద్, జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఆ కవల సోదరులను చూసి విధికి కన్నుకుట్టింది. పుట్టిన ఊరును వదిలి పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లిన వారిని మృత్యువు వెంటాడింది. అమ్మ గర్భంలో నుంచే కలిసిమెలిసి ఉన్న ఇద్దరూ ఒకేసారి ఈలోకాన్ని వీడి వెళ్లిపోయారు. గుండెల్ని పిండేసే ఈ విషాద ఘటన బుధవారం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది.

జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికూర్ర గ్రామానికి చెందిన రామ్, లక్ష్మణ్(32) కవలలు. చదువు మధ్యలోనే ఆపేసి.. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి శివారులోని గుండ్లపోచంపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మూతపడిన 'సాబూరి ఫార్మా ప్రైవేటు లిమిటెడ్' సంస్థలో ఫ్యాబ్రికేషన్ పనులకు వెళ్లారు. ఓ షెడ్డుకు ఉన్న పైపులను తొలగిస్తుండగా రామ్ అదుపుతప్పి కింద ఉన్న రసాయనాల ట్యాంకులో పడిపోయాడు. రసాయనాలు మింగి రామ్ ఉక్కిరిబిక్కిరి అవుతుండగా అతడిని కాపాడేందుకు లక్ష్మణ్ వెంటనే ఆ సంపులోకి దిగాడు. స్పృహకోల్పోయిన రామ్‌ను బయటకు తీసిన లక్ష్మణ్ సైతం నోట్లో నుంచి నురగలు కక్కుకుంటూ అక్కడే పడిపోయాడు. వీరిద్దర్నీ కాపాడే ప్రయత్నంలో మరో కార్మికుడు వెంకట్రామ్‌రెడ్డి రసాయనం బారిన పడ్డారు. ముగ్గురినీ షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రామ్, లక్ష్మణ్‌లు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకట్రామ్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆ ట్యాంకులో నిల్వచేసిన రసాయనం ఏమిటన్నది నిర్ధారణ కాలేదు. ఈ ఘటనకు బాధ్యులైన గుత్తేదారు నారాయణరావు, పరిశ్రమ నిర్వాహకుడు సతీశ్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



రామ్, లక్ష్మణ్ (పాతచిత్రాలు)

ఎంఈడీలో ప్రవేశాలకు 21 వరకు గడువు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం మంగళవారపుపేటలోని గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఎంఈడీ కోర్సులో చేరేందుకు ఈనెల 21వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ కె.బ్రహ్మాచారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సంబంధిత ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై ఏదేని కళాశాలలో ప్రవేశం పొందని వారు తక్షణం చేరేందుకు 21వ తేదీలోగా కళాశాలలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎంఈడీ కోర్సులో చేరవచ్చన్నారు. ఇతర వివరాలకు 9395381133కి ఫోన్ చేసి పనిదినాల్లో తెలుసుకోవచ్చని సూచించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- ● వాడపల్లి దేవస్థానం డీసీ సూర్యచక్రధరరావు
- ● ఈ నెల 21 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లు, సౌకర్యాల గురించి దేవస్థానం డిప్యూటీ కమిషనర్(డీసీ) నల్లం సూర్యచక్రధరరావు 'న్యూస్‌టుడే'కు వివరించారు.

ఈసారి భక్తులకు ప్రత్యేక దర్శనం

బ్రహ్మోత్సవాలకు సుమారు 2 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. వీరు ఎటువంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, ఎండకు, వానకు తట్టుకునేలా షామియానాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం ఉంటుంది. పులిహోర ప్రసాదం, నిత్యాన్నదానం అందిస్తాం. తగినన్ని లడ్డూలు తయారు చేయిస్తున్నాం. ఇందుకు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం.

తగినన్ని విశ్రాంతి గదులు..

భక్తులు తగినన్ని విశ్రాంతి గదులు లేక అసౌకర్యానికి గురవుతున్న మాట వాస్తవమే. శాశ్వత విశ్రాంతి భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదించాం. ఇప్పటికే వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం పాత భవనంలో ఇబ్బంది లేకుండా అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నాం. కొత్తభవన నిర్మాణానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారు. త్వరలో పనులు పూర్తిచేస్తాం. పూర్తయితే సమస్య చాలావరకు పరిష్కారం అవుతుంది. మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాం.

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి..

ఆలయంలో ప్రసాదం పోటు, అన్నదాన ప్రసాద విభాగం, క్యూలైన్లు అన్నీ తనిఖీ చేశాం. అక్కడక్కడా కొన్ని సమస్యలు గుర్తించాం. ముఖ్యంగా ఆలయం ఎదురుగా కోనేరు ఏర్పాటు, విశ్రాంతి గదులు, ఇతర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్న తలంపుతో ముందుకు సాగుతున్నాం. వీటి గురించి ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించాం. రథాన్ని భద్రపరిచేందుకు త్వరలో షెడ్డు నిర్మిస్తాం.

ప్రదక్షిణలు చేసేందుకు అనువుగా..

భక్తులు ప్రదక్షిణాలు సులువుగా చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నాం. తాగునీటి సౌకర్యం కల్పించాం. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, గ్రామస్థులు, వివిధ శాఖల అధికారుల సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

గమనించకుంటే గోదారిలోకే..!



వాసాలతిప్ప వెళ్లేందుకు నదీపాయపై నిర్మించిన వంతెన అప్రోచ్ రహదారులు అధ్వానంగా మారాయి. వంతెన గోడకు అనుకుని పెద్ద గుంత ఏర్పడింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనచోదకులు దీనిని గమనించకుండా ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా నదిలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ఇక్కడి గుంతలను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం**

పల్లాలమ్మ ఆలయ అభివృద్ధికి కార్యాచరణ

సీఎం ఆదేశాలకు అనుగుణంగా సౌకర్యాలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్: కొత్తపేట నియోజకవర్గం పరిధిలో వానపల్లిలోని పల్లాలమ్మ ఆలయ అభివృద్ధి పనులకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టులో ఆలయాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారన్నారు. ప్రసాదం తయారీ షెడ్డు, ప్రహరీ, మరుగుదొడ్లు, స్నానపుగదులు, నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ సాధారణ నిధుల నుంచి రూ.83 లక్షలు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఉద్యాన నిర్మాణాన్ని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను రానున్న డిసెంబరు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేవాదయశాఖ అధికారులు రమేష్ బాబు, దుర్గేష్‌కుమార్, సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న హరీష్‌మాథుర్

త్వరలో బ్లో అవుట్ బాధితులకు నష్టపరిహారం

ఉప్పలగుప్తం: కాట్రేనికోన మండలం ఉప్పూడిలో గతంలో సంభవించిన బ్లో అవుట్ కారణంగా నష్టపోయిన గ్రామస్థులకు త్వరలోనే పరిహారం అందుతుందని ఎంపీ హరీష్‌మాథుర్ తెలిపారు. రెండేళ్లయినా ఓఎన్జీసీ అధికారులు పరిహారం అందించలేదని ఇటీవల గ్రామస్థులు హరీష్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ హరీష్ బుధవారం దిల్లీలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన మంత్రి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందని, త్వరలోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎంపీ హరీష్‌మాథుర్, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన అమలాపురం యూటీఎఫ్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. నమోదు ప్రక్రియ నవంబరు 6తో ముగుస్తుందన్నారు. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని వివరించారు. కార్యక్రమంలో శాఖ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, బి.చంద్రకళ, కె.శ్రీనివాసరావు, వి.ఎన్.గౌడ్, రమణ, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివకోటి లాకు తొలగింపుపై అభ్యంతరం

కొత్తది నిర్మించాలంటే రూ.25 కోట్లపైనే ఖర్చు

జాతీయ రహదారి 216పై బైపాస్ ఏర్పాటు కోసం రాజోలు మండలం శివకోటిలోని సర్ ఆర్థర్‌కాటన్ హయాంలో నిర్మించిన లాకు తొలగించే అంశంపై జలవనరులశాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై అయిదు రోజుల క్రితం ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం, రాజోలు

శివకోటి లాకుపై ఆధారపడి మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో 16,454 ఎకరాల ఆయకట్టు ఉంది. బైపాస్ రహదారి కోసం దీన్ని తొలగిస్తే ఈ ఆయకట్టుకు నీరందక ఆ ప్రాంతంలో ఉప్పునీటి సాంద్రత పెరిగే ప్రమాదం ఉంది. అన్నింటికి మించి నూతన కట్టడం నిర్మించాలంటే సుమారు రెండేళ్ల సమయం పడుతుంది. రైతులు అంతకాలం పాటు ఖరీఫ్, రబీ పంటలను వదులుకోవాల్సి వస్తుంది.



శివకోటి లాకు

2 లక్షల మందికి తాగునీటి ఇక్కట్లు..

ఈ లాకు నుంచి నీరు సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని రక్షిత మంచినీటి ప్రాజెక్టులకు తాగునీటి అవసరాల కోసం వెళుతుంది. లాకు తొలగించి నూతన కట్టడం నిర్మించాలంటే సుమారు రెండేళ్ల పాటు సమయం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో సుమారు 2 లక్షల మంది జనాభా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు అనివార్యమవుతాయి. ప్రధానంగా నూతన కట్టడం నిర్మించాలంటే ఇప్పటి మెటీరియల్ ధరల ప్రకారం సుమారు రూ.25 కోట్ల నిధులు అవసరం ఉంటుందని చెబుతున్నారు. అన్ని నిధులు ప్రభుత్వం విడుదల చేయాలంటే ఆర్థిక భారం అవుతుంది. కాటన్ హయాంలో నిర్మించిన కట్టడాలు ఒక మాన్యుమెంట్‌లా వ్యవహరిస్తారు. అలాంటి లాకును తొలగించకుండా బైపాస్ రహదారి ఎలైన్‌మెంట్ మార్పుచేస్తే మంచిదనే భావన సర్వత్రా వినిపిస్తోంది.

ఉన్నతాధికారులకు పంపాం

శివకోటి లాకు తొలగించకూడదని అభ్యంతరం తెలుపుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. దీన్ని తొలగిస్తే వచ్చే ప్రతికూల పరిస్థితులను వివరించాం. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి.

- నాగేంద్రకుమార్, డీఈఈ, జలవనరులశాఖ, పి.గన్నవరం సబ్‌డివిజన్

తుపాను.. పరేషాన్..

ఎగసిన కెరటం



అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీరంలో అలలు ఎగసి పడ్డాయి. సముద్రం 50 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకు వచ్చింది. కెరటాలు నేరుగా ఓడలరేవులోకి రావడంతో ఆందోళన నెలకొంది. సందర్శకులు సముద్ర తీరం వద్దకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. - న్యూస్‌టుడే, అల్లవరం

ఎనలేని కష్టం

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ముంపు సమస్య ఏర్పడుతోంది. కాట్రేనికోనలోని సంత మార్కెట్‌కి వెళ్లే రోడ్లల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో జనం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తూ అవస్థ పడ్డారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన



భారీ వర్షాలు, ఈదురు గాలుల దాటికి పలు చోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప సమీపంలో కొబ్బరి చెట్టు నేలవాలిన దృశ్యాలు కనిపించాయి. యానాం ఎక్కరగ్రౌండ్ మొదటి వీధిలో విద్యుత్తు స్తంభం విరిగి కారుపై పడటంతో ధ్వంసమైంది. - న్యూస్‌టుడే, కాట్రేనికోన, యానాం



తీరని నష్టం



ప్రొటోకాల్ తప్పనిసరి: జడ్పీ సీఈవో

అంబాజీపేట: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ తప్పనిసరి అని జడ్పీ సీఈవో లక్ష్మణరావు అన్నారు. బుధవారం అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం కల్పిస్తూ ఫ్లెక్సీల్లో వారి చిత్రాలు ముద్రించాలన్నారు. అయినవిల్లి, అంబాజీపేట, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాలకు త్వరలో ఎంపీడీవోలను నియమిస్తామన్నారు. పలు విషయాలపై చర్చించారు. ఎంపీడీవో సరోవర్ ఎటువంటి సమాచారం తెలపడం లేదని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గుణగణాలు కీర్తించి.. పరిణయానికి ఒప్పించి!

నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం.. వామన అవతారంలో శ్రీనివాసుడి దర్శనం



వామనావతారంలో స్వామివారు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని వెండి శేష వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి.. పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు, అర్చకులు రెండు వర్గాలుగా ఏర్పడి.. ఒకరు స్వామివారి, మరొకరు అమ్మవార్ల గుణగణాలు కొనియాడి.. పెళ్లికి ఒప్పించిన తీరు భక్తులను కనువిందైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా స్వామివారు వామనావతారంలో దర్శనమిచ్చారు. హనుమద్వాహనాన్ని అధిరోహించి ద్వారకాతిరుమల పురవీధుల్లో శ్రీరాముని అలంకారంలో విహరించారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.

చేశారు పనులు.. రాలేదు నిధులు

- అప్పటి వైకాపా ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల ఆవేదన
- నేటికీ రూ.78.11 లక్షల బిల్లులు చెల్లించని వైనం



2021 ఆగస్టు 16న పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నాడు-నేడు రాష్ట్రస్థాయి రెండో దశ పనులు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (పాత చిత్రం)

2021 ఆగస్టు 16.. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి నాడు-నేడు మొదటి దశ పనులను ప్రజలకు అంకితం చేయడం, రెండోదశ పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిందిస్థాయి అధికారులు, దిగువశ్రేణి ఉద్యోగులు వివిధ రకాల పనులు చేయించారు. ఇందుకోసం ఖర్చు చేసిన రూ.78.11 లక్షలు నేటికీ చెల్లించకపోవడంతో లబోదిబోమంటున్నారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తారని భావిస్తే నాటి వైకాపా ప్రభుత్వం మొండిచేయి చూపించింది. జగన్ పర్యటన సమయంలో పాఠశాల లోపల, బయట వేల సంఖ్యలో చిత్రాలు వేయించారు. మొక్కలు నాటించారు. సభావేదిక ఏర్పాట్లు, కార్యక్రమానికి రెండు రోజుల ముందు వర్షం రావడంతో సభా ప్రాంగణాన్ని మెరక చేయించారు. పాఠశాల వెలుపల ఇంటర్‌లాకింగ్ పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేశారు. గ్రామంలో మూడుచోట్ల వాహనాల కోసం ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాలను చదును చేశారు.

- ఉన్నతాధికారుల విడిది కోసం ఒక రిసార్ట్‌లో గదులు బుక్ చేయించారు. ఇందుకోసం ఓ కిందిస్థాయి అధికారి రూ.67,404 చెల్లించారు.
- ప్రత్యేకించి ఇక్కడ వేల సంఖ్యలో బొమ్మలు వేసిన చిత్రలేఖన ఉపాధ్యాయులకు రూ.6.80 లక్షలు చెల్లించాలి.
- రాజమహేంద్రవరంలోని ఒక నర్సరీ నుంచి మొక్కలు తీసుకొచ్చి ఇక్కడ నాటినందుకు రూ.2.60 లక్షలు ఇవ్వాలి.
- ఉన్నత పాఠశాలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులతో కొన్ని పనులు చేయించారు. ఇందుకోసం రూ.4.27 లక్షలు చెల్లించాలి.

వివరాలు పంపాం..

నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పర్యటన పురస్కరించుకుని మా పరిధిలో పలువురితో వివిధ పనులు చేయించాం. తొమ్మిది మందికి రూ.21.40 లక్షలు చెల్లించాలి. ఇంతవరకు ఇవ్వలేదు.

- వి.చంద్రశేఖర్, డీఈఈ, పంచాయతీరాజ్ సబ్‌డివిజన్, పి.గన్నవరం

వచ్చి అడుగుతున్నారు..

గత సీఎం పర్యటన పురస్కరించుకుని ఏర్పాట్ల కోసం వివిధ శాఖలు చేసిన పనులకు నేటికీ బిల్లులు చెల్లించలేదు. కార్యక్రమం మా పాఠశాల వేదికగా జరగడంతో పలువురు వచ్చి డబ్బులు అడుగుతున్నారు. మా నుంచి విద్యాశాఖాధికారుల ద్వారా ప్రభుత్వానికి ఎన్నికల ముందు కూడా వివరాలు పంపాం. మొత్తం రూ.78.11 లక్షల బిల్లులు రావాలి.

- డి.యస్.వి.ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, పి.గన్నవరం

జయశ్రీ ప్రతిభ

రూ.1.54 కోట్ల వార్షిక వేతనంతో అమెజాన్‌లో కొలువు



మల్లిపూడి జయశ్రీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కాకినాడ పట్టణానికి చెందిన మల్లిపూడి జయశ్రీ ఇటీవల అమెరికా వాషింగ్టన్ స్టేట్, సియాటిల్ పట్టణ అమెజాన్‌లో ఎస్‌డీఈ ఉద్యోగానికి ఎంపికై రూ.1.54కోట్ల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించింది. కాకినాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన జయశ్రీ 984/1000 మార్కులు సాధించింది. ఎన్ఐటీ తాడేపల్లిగూడెంలో బి.టెక్ కంప్యూటర్ సైన్సు కోర్సు చదివి డిస్టింక్షన్‌లో మార్కులు సాధించింది. తొలుత హైదరాబాద్‌లో టీసీఎస్‌లో ఉద్యోగం పొందింది. అనంతరం అమెరికా దేశంలోని టెక్సాస్‌లో మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్సు చేశారు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన ఆమె ప్రఖ్యాత కంపెనీ అమెజాన్ యూఎస్‌ఏ సియాటిల్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్(ఎస్‌డీఈ)గా ఎంపికయ్యారు. నవంబరు 4వ తేదీన ఉద్యోగంలో చేరేందుకు ఉత్తర్వులు అందుకున్నారు. జయశ్రీ తండ్రి శ్రీనివాస్ డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండగా, తల్లి సత్యనారాయణమ్మ గృహిణి.

ఖైదీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

దానవాయిపేట, (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలోని అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ ఫైల్ చేసే విషయంలోను పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీల సమస్యలు, బెయిల్ జామీను విషయంలో తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. అనంతరం వాటిని సంబంధిత న్యాయస్థానాలకు సిఫార్సులు చేశారు. బాధితుల పరిహారాలకు సంబంధించిన అంశాలను ఆమోదించారు. ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, తూర్పు ఎస్పీ డి.నరసింహ కిషోర్, కాకినాడ, కోనసీమ ఏఎస్పీలు ఎం.జె.వి.భాస్కరరావు, ఎ.వి.ఆర్.పి.బి.ప్రసాద్, రాజమహేంద్రవరం జేసీ ఎస్.చిన్నరాయుడు, పీపీ సీహెచ్.ప్రసాద్, కొత్తపేట, అమలాపురం ఆర్డీవోలు, కేంద్ర కారాగారం మహిళా, పురుషుల జైలు అధికారులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు స్థలాల సేకరణపై పరిశీలన



పాశర్లపూడిలో రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడి, మామిడికుదురులో 216 నంబరు జాతీయ రహదారి, దానికి సంబంధించిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థలాల సేకరణకు రైతుల నుంచి అభ్యంతరాలున్న అంశాలపై అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం పరిశీలించారు. దీనికి సంబంధించి సమగ్ర పరిశీలన, పరిష్కారాలకు కలెక్టర్ నియమించిన ఉన్నతాధికారుల కమిటీ సమక్షంలో తహసీల్దారు కార్యాలయంలో ఆయా రైతులతో మాట్లాడారు. రహదారిలోకి వచ్చే తమ స్థలాలకు చదరపు గజాల్లో పరిహారమివ్వాలని రైతులు కోరారు. తహసీల్దారు సుబ్రహ్మణ్యాచారి, డ్వామా పీడీ మధుసూదన్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈ కృష్ణారెడ్డి, డీపీవో శాంతలక్ష్మి, హౌసింగ్ ఇంఛార్జి పీడీ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు

అమలాపురం పట్టణం: జిల్లాలో ఈ నెల 31వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. అమలాపురం నల్లవంతెన దిగువన ఒకటో వార్డులో నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45,560 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు.

యువకుల పాలిట విషాద రేవు

- గోపులంక పుష్కరరేవులో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు
- ఆరుగురు స్నేహితుల కళ్లెదుటే నీట మునక




గోదావరిలో పడవపై గాలిస్తున్న జాలర్లు, (అంతరచిత్రం) కుతాని సాయిచంద్ర

తాళ్లరేవు, న్యూస్‌టుడే: విహారయాత్ర ఆ విద్యార్థుల్లో విషాదం నింపింది. రాజమహేంద్రవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) గోపులంక పుష్కరరేవులో బుధవారం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. తమ కళ్ల ఎదుటే స్నేహితుడు నీటిలో మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు తేరుకోలేకపోతున్నారు. ఇదే ప్రాంతంలో ఏడాది కిందట నలుగురు మృతి చెందడం గమనార్హం.

యానాం వెళ్లి వస్తూ..

కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు బుధవారం కారులో యానాం విహార యాత్రకు వెళ్లారు. ఇందులో రాజమహేంద్రవరానికి చెందిన కుతాని సాయిచంద్ర, రవ్వా మంజుల్, వేంపాటి సంతోష్, నిఖిల్, తణుకుకు చెందిన మండా వంశీ, కార్తీక్, తాడేపల్లిగూడేనికి చెందిన శివరామ్ ఉన్నారు. మధ్యాహ్నం యానాం నుంచి తిరిగి వస్తూ తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక వద్ద గోదావరి పుష్కర రేవు వద్ద ఆగారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగారు. కొద్దిసేపటి తర్వాత సాయిచంద్ర స్నేహితుల కళ్లెదుటే నీటిలో మునిగి గల్లంతయ్యాడు.

ఈత రాకుండానే దిగాడా..?

మిత్రుడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని మిగిలిన ఆరుగురు యువకులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ విద్యార్థికి ఈత రాకపోవడంతో మునిగిపోయినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటం, మేట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గల్లంతైన విద్యార్థి కోసం జాలర్లు పడవలపై గాలించారు. అతడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. రాజమహేంద్రవరంలోని ఎ.వి.అప్పారావు రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

ఏడాది కిందట ఏం జరిగిందంటే..

గత ఏడాది అక్టోబరు 21న ఇదే ప్రాంతంలో స్నానానికి దిగి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. ఒకరోజు తర్వాత వారి మృతదేహాలు లభించాయి. ఆ రోజు పశ్చిగోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆరుగురు యువకులు యానాం విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తూ ఇక్కడ స్నానానికి దిగారు. ఒక యువకుడు మునిగిపోగా. . రక్షించేందుకు వెళ్లిన ముగ్గురితో కలసి నలుగురూ ప్రాణాలు కోల్పోయారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, న్యూస్‌టుడే: కరప మండలం కొంగోడులో మంగళవారం రాత్రి శుభకార్యక్రమానికి విద్యుత్తు దీపాలు బిగిస్తుండగా కె.గంగవరం మండలం వత్రపూడికి చెందిన శీలం ప్రవీణ్‌కుమార్ (17) విద్యుదాఘాతానికి గురై నిచ్చెన పైనుంచి కింద పడిపోయాడు. అపస్మారకస్థితికి చేరిన అతడిని స్థానికులు వెంటనే గొల్లపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లికి చెందిన శీలం నారాయణమూర్తి తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి వత్రపూడి గ్రామంలో నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు ప్రవీణ్ కుమార్ అద్దంపల్లికి చెందిన విద్యుత్తు పనుల కాంట్రాక్టర్ యనమదల గోవింద్‌తో కలిసి వివాహాది శుభకార్యక్రమాల్లో లైటింగ్ పనులు చేస్తుంటారు. తండ్రి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.సునీత తెలిపారు.

కుటుంబానికి న్యాయం చేయాలి

మసీదు సెంటర్ (కాకినాడ): విద్యుదాఘాతంతో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి బీఎస్పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు సుబ్బుబాయ్, తదితరులు ఆందోళన చేశారు. సంబంధిత గుత్తేదారుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఏలేటి శ్రీనుబాబు, మేగరాజు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు 17 నామపత్రాలు



నామపత్రాలు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి నందన

మసీదు సెంటర్(కాకినాడ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలకు సంబంధించి జీజీహెచ్‌లో మొత్తం 17 నామపత్రాలు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి టి.నందన బుధవారం తెలిపారు. జాబితాలో 243 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బుధవారం సాయంత్రం 4 వరకు నామపత్రాలు స్వీకరించామన్నారు. గురువారం పరిశీలిస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 18 వరకు గడువు ఉందన్నారు. 23న ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. అధ్యక్ష పదవికి 3, ఉపాధ్యక్ష పదవికి 2, కార్యదర్శికి 3, కోశాధికారికి 3 నామినేషన్లు, ఈసీ సభ్యుల స్థానాలకు 6 నామినేషన్లు వచ్చాయన్నారు. అధ్యక్ష పదవికి కాకినాడ జీజీహెచ్ హెడ్‌నర్సులు బూరిగ విజయలక్ష్మి, గోడి మేరి సుజాత, అయితాబత్తుల చినధనలక్ష్మి, ఉపాధ్యక్ష పదవికి జీజీహెచ్ నుంచి హెడ్‌నర్సు బొడ్డే రాణి, రాజమహేంద్రవరం జీజీహెచ్ నుంచి స్టాఫ్ నర్సు అంజలీశ్రీ నామినేషన్లు వేశారన్నారు. అధికారులు శివకామేశ్వరరావు, బి.గణేష్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి.. అదనపు కట్నానికి వేధింపులు

భర్త దాడిలో వివాహిత మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: ప్రేమించి పెళ్లి చేసుకొన్న వ్యక్తి అదనపు కట్నం కోసం భార్యను వేధించి, విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ ఘటన రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాశి విశ్వనాథం వివరాల మేరకు రాజమహేంద్రవరం ఇన్నీసుపేటకి చెందని కర్రి ఈశ్వర్ నగరంలో ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఆయన హుకుంపేట డీ బ్లాక్‌కు చెందిన దుర్గభవాని(19)ని రెండేళ్ల కిందట ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో ఈశ్వర్‌కు రూ.1.50 లక్షలు కట్నం ఇచ్చారు. ఇటీవల కొంత కాలంగా అదనంగా కట్నం తీసుకురావాలని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. ఆ క్రమంలో భర్తతో గొడవపడిన దుర్గాభవాని నెల రోజులుగా తల్లి లక్ష్మి వద్ద ఉంటోంది. గత అర్ధరాత్రి మద్యం తాగి అత్తవారి ఇంటికి వచ్చిన ఈశ్వర్ భార్యతో గొడవపడ్డాడు. ఆమెను నేలపై పడేసి చేతులు, కాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఆ ఘటనలో అపస్మారకస్థితికి చేరుకున్న భవానిని స్థానికుల సహాయంతో తల్లి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. బుధవారం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. గత కొంత కాలంగా ఈశ్వర్ పనికి కూడా వెళ్లకుండా నగదు కోసం తన కుమార్తెను నిత్యం వేధింపులకు గురి చేశాడని మృతురాలి తల్లి పోలీసులుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

కౌలు రైతులకు ఓటుహక్కు కల్పించాలని వినతి

మామిడికుదురు, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో కౌలు రైతులకు కూడా ఓటుహక్కు కల్పించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు కోరారు. సంఘ నాయకులతో కలిసి మామిడికుదురు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సుబ్రహ్మణ్యాచారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వరి పంట సాగుచేస్తున్న వారిలో దాదాపు 90 శాతం మంది కౌలురైతులే ఉన్నందున వారికి కూడా గుర్తింపు కార్డుల ఆధారంగా ఓటుహక్కుతో సంఘాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు తాటికాయల ఉదయ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపునీటి మళ్లింపుపై చర్యలు తీసుకోండి

మలికిపురం, న్యూస్‌టుడే: తీర గ్రామాల్లో ముంపునీటి మళ్లింపుపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జలవనరులశాఖ ఎస్ఈకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లేఖ రాసినట్లు బుధవారం విలేకర్లకు చెప్పారు. మలికిపురం మండలం చింతలమోరి, శంకరగుప్తం, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానంతో పాటు పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాలు గత మూడు నెలలుగా ముంపు నీటిలోనే ఉన్నాయన్నారు. వర్షాలు, ఆక్వా సాగు, ఆక్రమణల కారణంగా నీరు బయటికి వెళ్లే మార్గంలేక సమస్య నెలకొందన్నారు. ఫలితంగా రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివారణకు ప్రణాళిక రూపొందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్తాచెదారం తీశారు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ఇందిరా కాలనీలో రోడ్డు చెంతన చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్. దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

పూడిక తొలగింపు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లి గ్రామంలోని డ్రెయిన్లు వ్యర్థాలతో నిండిపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి పోచిరాజు సూర్యకుమారి, కార్యదర్శి విజయ్‌ల వద్ద ప్రస్తావించగా స్పందించారు. ఇబ్బందుల్లేకుండా పూడికలు తీయించారు.

పైపులైనుకు మరమ్మతులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: బి.దొడ్డవరం పరిధి బొలిశెట్టివారిపాలెంలో తాగునీటి పైపులైను దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి రామశివసుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. పైపులైనుకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

వాయుగుండం.. అన్నదాతకు గండం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు భారీవర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత దాళ్వాసాగు కోతల సమయంలో కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పొట్ట దశలో ఉండగా వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటా అని వారంతా కలవరపడుతున్నారు. - న్యూస్‌టుడే, మలికిపురం


గుడిమెళ్లంకలో పొట్ట దశలో ఉన్న వరిచేను

ఖరీఫ్ నారుమళ్లు ఆలస్యమవడం, అదే సమయంలో గత జులైలో వర్షాలు వచ్చి అవన్నీ దెబ్బతినడం వంటి కారణాలతో చాలామంది రైతులు సమయాభావంతో పొలాలను ఖాళీగా వదిలేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రాజోలు వ్యవసాయ సబ్ డివిజనులోని మలికిపురం మండలంలో కేవలం 489 ఎకరాల్లో, సఖినేటిపల్లి మండలంలో 200 ఎకరాల్లోపు, రాజోలు మండలంలో 2300 ఎకరాల్లో సార్వా నాట్లు వేశారు.

అస్తవ్యస్త డ్రెయిన్లకు తోడు..

రాజోలు వ్యవసాయ సబ్‌డివిజనులో అస్తవ్యస్త మురుగునీటి వ్యవస్థతో రైతులు ప్రతి సంవత్సరం ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ శంకరగుప్తం మేజరుతో పాటు వేపచెట్టు మీడియం, కత్తిమండ, పేములకాలువ, రామరాజులంక, గొందినొవ్వా, నేరేళ్లచేడు తదితర డ్రెయిన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వరిచేలు ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో గత రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో కురిసే వర్షాలు వీటికి తోడైతే డ్రెయిన్లు పొంగి పొర్లుతాయి. చేలల్లోని మురుగునీరు దిగక మళ్లీ తమకు నష్టాలు తప్పవని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు అవసరం

వర్షాలతో వరిచేలు ముంపునకు గురైతే రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని మలికిపురం మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేశ్ సూచించారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉన్న పరిస్థితుల్లో చేలో నీరు అవసరమే అయినా అవసరానికి మించి ఉంటే బయటికి మళ్లించాలన్నారు. అనంతరం ఎకరానికి 10 కేజీల పొటాష్, 10 కేజీల యూరియాను వేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడేనికి చెందిన బట్లంకి భుజంగరావు, భాగ్యలక్ష్మి దంపతులు బుధవారం రూ.50,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ అర్చకుడు స్వామివారి చిత్రపటం అందించారు.

ఇసుక రేవుల పరిశీలన

రావులపాలెం గ్రామీణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం ఊబలంక, పొడగట్లపల్లి ఇసుక రేవులను బుధవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహం ఏవిధంగా ఉంది.. ఎన్ని రోజుల్లో తవ్వకాలు ప్రారంభించొచ్చు తదితరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు. ● ఆత్రేయపురం మండలంలోని అంకంపాలెం తదితర ఇసుక రేవులను ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గుర్తించిన రేవుల నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా బాటలు ఏర్పాటు చేసి త్వరలో తవ్వకాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

క్రీడా మైదానం పనులు..

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న క్రీడా మైదానం పనులను బుధవారం సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో బోధన తదితర విషయాలను ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించరూ

అంతర్వేది, న్యూస్‌టుడే: మత్స్యకార కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్‌కు తెదేపా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ సభ్యుడు తిరుమాని ఆచార్యులు, రాజోలు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘాల అధ్యక్షుడు ఇల్లింగి వెంకటరమణ విజయవాడలో కలిసి విన్నవించారు. మొక్క అందించారు. గత వైకాపా ప్రభుత్వంలో ఎటువంటి రాయితీ పథకాలు ఇవ్వలేదని వాపోయారు. 2014 నుంచి 2019 వరకు తెదేపా అధికారంలో ఉన్నపుడు రాయితీతో కూడిన బోట్లు, వలలు, ఐస్‌బాక్సులు ఇచ్చేవారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. మల్లాడి నారాయణ, బొమ్మిడి ఏడుకొండలు, తిరుమాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు మొక్కను ఇస్తున్న నాయకులు

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

సఖినేటిపల్లి: పదోతరగతిలో ప్రతి విద్యార్థి, పాఠశాల మంచి మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం అన్నారు. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, కొత్తపేట, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాజోలు, సోంపల్లి, తాటిపాక, శివకోటి, చింతలపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.11.30 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పలు సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఉప ఎంపీపీ ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.11.24 కోట్లతో పనులు

పి.గన్నవరం నియోజకవర్గంలో రూ.11.24 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు గుర్తించామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ పనులు త్వరలోనే మొదలవుతాయన్నారు. పి.గన్నవరం, వై.వి.పాలెం, బెల్లంపూడి, ఊడిమూడి, జి.పెదపూడి, కుందాలపల్లి, నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం, ముంగండ గ్రామాల్లో ఆయన వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట మండలంలో రూ.2.48 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, భూసి జయలక్ష్మి, భాస్కరరావు, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.


తాటిపాకలో.. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


డి.ఎస్.పాలెంలో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యనారాయణ భూమిపూజ


కొత్తపేటలో.. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అంతర్వేదికరలో పల్లె పండగ

అంతర్వేదికరలో సర్పంచి పోతురాజు కిషోర్ అధ్యక్షతన పల్లె పండగ కార్యక్రమం జరిగింది. రూ.20 లక్షలతో నాలుగు సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు, సఖినేటిపల్లి తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు నిరసన

మామిడికుదురు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 2019 తర్వాత నియమించిన సిబ్బందిని తొలగిస్తే ఆందోళన చేస్తామని, ఉద్యోగ విరమణ వయో పరిమితి 62 ఏళ్లకు వర్తింపజేయాలంటూ మామిడికుదురులోని సొసైటీ వద్ద వారంతా బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వేతన సవరణ అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న కాకినాడ డీసీసీబీ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆర్.కె.జనార్దన్‌రెడ్డి, ఎస్.శ్రీరామ్, ఎ.పెద్దిరాజు, పీవీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

అంతర్వేదిలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి పూజలు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు మంగెన గురవయ్య విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎంవీఎస్ ప్రసాద్, అధ్యాపకులు స్వాగతం పలికారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాల్సిందే..

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం పిలుపు మేరకు బుధవారం ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. గత ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు జీవో విడుదల చేసి అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా అమలు చేయాలని వారు కోరారు.

కొనసాగిన అధ్యాపకుల రిలే దీక్ష

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం మలికిపురంలోని ఎంవీఎన్, జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 36వ రోజున కూడా కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గెడ్డం పేర్రాజు, ఫిలిప్ రాజు, సీపీఎం నాయకుడు సీహెచ్ సూర్యప్రకాశరావు, నల్లి శివ, కుసుమ నాని తదితరులు అధ్యాపకులకు జీతాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. సమస్యకు పరిష్కారం చూపాలని కరస్పాండెంట్‌ను కోరారు.

బీరువా బహూకరణ

మలికిపురం, న్యూస్‌టుడే: గుడిమెళ్లంక టి.సావరం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కడలి నవీన్, మూడో తరగతి చదువుతున్న ఉదయధనుష్‌ల తల్లిదండ్రులు పాఠశాలకు బీరువా సమకూర్చారు. దీన్ని బుధవారం ఎంఈవో ఎం.విజయశ్రీ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

అంబాజీపేట, న్యూస్‌టుడే: రొమ్ము క్యాన్సర్ నివారణకు మహిళలు తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు జయశ్రీ, రాశి తెలిపారు. బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు మహిళలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట మండలం అవిడి రేవు వద్ద గల మద్యం దుకాణం తొలగించాలని బుధవారం కొందరు గ్రామస్థులు ధర్నా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ దుకాణం నిర్వహించేవారని, ఇళ్లమధ్యలో ఉండటంతో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తాజాగా ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేయడం తగదన్నారు. మరోవైపు ఇక్కడి దుకాణంలో పాత ధరలకే మద్యం విక్రయాలు జరగడంతో పలువురు మందుబాబులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు.



గత పాలకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

మలికిపురం నుంచి గొగ్గన్నమఠం వరకు 10 కిలోమీటర్ల పొడవు గల డ్రెయిన్ గుర్రపుడెక్క, తూడుతో నిండి దుర్భరంగా మారింది. నీటి పారుదల లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ కాలువను ఆనుకొని ఉన్న గ్రామాల్లోని ఆయకట్టు నుంచి నీరు దిగక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక వర్షాల కారణంగా కాలువ పొంగి చేల్లోకి చేరుతోందని పొన్నమండకు చెందిన ఓ రైతు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డ్రెయిన్స్ ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా గతంలో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాని కారణంగా పనులు జరగలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మళ్లీ కార్యాచరణ చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

గుంతలో పడితే ప్రమాదమే..



జగ్గన్నపేట-ములికిపల్లి మార్గంలో మొగలికుదురు వద్ద శిథిల కల్వర్టు పక్కన రహదారి మధ్యలో గుంత పడడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇక్కడ ప్రమాదాన్ని గుర్తించేలా సంబంధిత సిబ్బంది ఎర్ర వస్త్రంతో కర్రలు పెట్టినా అవి నేలకొరిగిపోయాయి. మామిడికుదురు, రాజోలు మండలాల్లోని 11 గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రధానమైన ఈ రహదారిలో రాత్రి సమయాల్లో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. సత్వరమే దీనికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. గుంతను పూడ్చేందుకు చర్యలు చేపడతామని ర.భ. ఏఈఈ కె. సురేష్ తెలిపారు. శిథిల కల్వర్టు ఆధునికీకరణకు రూ.35 లక్షలతో ప్రతిపాదనలు చేసి పంపామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు



మూతపడిన వైకాపా మద్యం దుకాణాలు

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రయివేటు వ్యక్తులకు లాటరీల్లో దుకాణాలు కేటాయించింది. దుకాణాలు దక్కించుకున్న వారంతా బుధవారం ఆయా గ్రామాల్లో వీటిని ప్రారంభించారు. దీంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన దుకాణాలు పి.గన్నవరంలో మూతపడ్డాయి. ఆయా ప్రదేశాలు వెలవెలబోయాయి. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

భారీవర్షం.. జలమయం

మలికిపురం, పి.గన్నవరం, సఖినేటిపల్లి, అయినవిల్లి, అంబాజీపేట, న్యూస్‌టుడే: బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మలికిపురం మండలం తూర్పుపాలెం, పడమటిపాలెం, శంకరగుప్తం, కేశనపల్లి, చింతలమోరి, రామరాజులంక, మట్టపర్రు తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై గుంతల్లో ముంపునీరు చేరి అస్తవ్యస్తమయ్యాయి. ● పి.గన్నవరం మండలం కుందాలపల్లి, ముంగండ, మానేపల్లి కాలువ గట్టు, పి.గన్నవరం తదితర గ్రామాల్లో రహదారులు వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. ● సఖినేటిపల్లి మండలంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ● అయినవిల్లి మండలం తొత్తరమూడి-పెదపాలెం రహదారిలో చెట్టుకొమ్మలు విరిగి పడటంతో విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.


సఖినేటిపల్లిలో నేలకొరిగిన చెట్టు


మలికిపురం-విశ్వేశ్వరాయపురం మధ్య..


అధ్వానంగా కుందాలపల్లి రహదారి

వాడపల్లి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలంటూ దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు బుధవారం దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను అమరావతిలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం భక్తులకు చేస్తున్న ఏర్పాట్ల గురించి వివరించారు.


దేవాదాయశాఖ కమిషనర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చక్రధరరావు

చీకటి మాటున.. ఇసుక రవాణా

మామిడికుదురు, న్యూస్‌టుడే: వైనతేయ నదీ తీరంలో ఇసుక అక్రమ రవాణా చీకటి మాటున అత్యంత గోప్యంగా సాగిపోతోంది. తవ్వి తీసిన చోట నుంచి కాకుండా పడవలను దూర గ్రామాలకు తరలించి అక్కడ్నించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. వీటిపై నిఘా పెట్టి అక్రమాలను అడ్డుకోవాల్సిన వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు ఒకటో రెండో పట్టుకోవడం తప్ప పూర్తిస్థాయిలో నిలువరించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


పాశర్లపూడిబాడవలో అక్రమాలకు అడ్డాగా ఉన్న ఇసుక తిప్ప

తవ్వేది ఒకచోట.. తరలింపు మరోచోట

రేవులు మొన్నటివరకు తెరవకపోవడం, స్థానికంగా నిర్మాణాలకు అందుబాటులో లేకపోవడంతో ఇసుకకు డిమాండు పెరిగింది. వైనతేయ నదీ తీరంలోని మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, ఆదుర్రు, లూటుకుర్రు, కరవాకలో అక్రమ తరలింపులు జరుగుతున్నాయి. పాశర్లపూడి-బోడసకుర్రు మధ్య వారధి ఆనుకుని ఏర్పడిన ఇసుక తిప్పలను తవ్వేసి పడవల ద్వారా బాడిలంక, పాశర్లపూడిలంక తీరాల్లోకి తరలిస్తున్నారు. చీకటి పడగానే నిర్దేశించిన చోట్లకు తరలించి అక్కడ సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్లలోకి ఎగుమతి చేస్తున్నారు. ఒక్క పడవ నుంచి తెచ్చిన ఇసుకను మూడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రోజుకి ఈ ప్రాంతాల నుంచి 20 నుంచి 30 ట్రాక్టర్ల వరకు అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం. ఒక్కో ట్రాక్టర్‌ను రూ.4 నుంచి రూ.4,500 వరకు అవసరాలకు అనుగుణంగా విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానికులకు కాస్తంత తక్కువ ధరకు ఇచ్చి అక్రమాలు బయట పడకుండా చూసుకుంటున్నారు. స్థానికంగా రేవులు తెరిచి అక్రమాలను అరికట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

తీర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం. వీటి అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు వీఆర్వోల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలన చేయిస్తాం. వీటిపై స్థానికులు సమాచారమిస్తే వెంటనే చర్యలు చేపడతాం.
- సుబ్రహ్మణ్యాచారి, తహసీల్దారు, మామిడికుదురు



దుర్భరంగా మారినా.. చర్యలు కరవేనా!

మామిడికుదురు మండలం నగరం నుంచి గెద్దాడ వెళ్లే రోడ్డు 200 మీటర్ల మేర గుంతలు పడి దుర్భరంగా మారడంతో మూడు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకునే రైతులు తీవ్ర ప్రయాసకు గురవుతున్నారు. మామిడికుదురు పరిధి గన్నేరుపుంత మీదుగా లూటుకుర్రు శివారు వరకు 2 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు పలుచోట్ల అంచులు జారిపోయి, గుంతలుగా మారడంతో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు గ్రామాలు, మూడు కాలనీలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇదే ఏకైక మార్గం కావడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలు చేసి పంపిస్తామని, నిధులు రాగానే పనులు చేపడతామని పంచాయతీరాజ్ జేఈ కృష్ణంరాజు తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు



మద్యం దుకాణాలు ప్రారంభం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీలో భాగంగా బుధవారం నుంచి కొత్త మద్యం దుకాణాలు వెలిశాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ప్రకారం మద్యం అమ్మాలని జిల్లా సూపరింటెండెంట్ ఎస్.కనక దుర్గా వరప్రసాద్ ఆదేశించారు. అమలాపురం నల్లవంతెన, ఎర్రవంతెన దిగువున, కామనగరువు, కాలేజీరోడ్డు, ఈదరపల్లి తదితర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

28న పురోహిత బ్రాహ్మణ విద్వత్ మహాసభ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: భీమవరంలో ఈ నెల 28న పురోహిత బ్రాహ్మణ విద్వత్ మహాసభ నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాబత్తుల రవిశర్మ తెలిపారు. పురోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలన్న లక్ష్యంతో సమాఖ్య పని చేస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల కుటుంబాలు పురోహిత్యంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన ఎర్రబల్ల హరీష్‌శర్మ దంపతులు రూ.50 వేలు విరాళంగా బుధవారం అందజేశారు. కుతుకులూరులోని తేతలి వీరవెంకటసత్యనారాయణరెడ్డి దంపతులు రూ.10 వేల విరాళాన్ని అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా



ట్యాంకు శుభ్రం

సమస్య: కొప్పిగుంటలో తాగునీటి ట్యాంకు లోపల నాచు పట్టింది. అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేయించాలి. - స్థానికులు

పరిష్కారం: సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో ట్యాంకును బ్లీచింగ్‌తో కడిగించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: పల్లంకుర్రు పంచాయతీ పరిధి మెట్లమిల్లిలో కొన్ని వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదు. - గ్రామస్థులు

పరిష్కారం: పంచాయతీ సర్పంచి అలివేణికి తెలపగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

కాలువల్లో పూడిక తొలగింపు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత ప్రాంతంలో కాలువ పూడికతో నిండిపోయింది. మురుగు పారక ఇబ్బందిగా ఉంది. - నాగేశ్వరరావు, స్థానికుడు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని పెద్దవంతెన వద్ద చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. చర్యలు తీసుకోవాలి. - ఎం.సత్తిబాబు

పరిష్కారం: కొండాలమ్మచింత, పెద్దవంతెన ప్రాంతాల్లో సమస్యలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరాజు దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **79811 19595**, ముమ్మిడివరం: **80085 74166**

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం, ముమ్మిడివరం

పల్లె ప్రగతికి అడుగులు

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు మహర్దశ పడుతోంది. ప్రభుత్వం వారం రోజులపాటు పల్లెపండగ నిర్వహిస్తోంది. ఈ నెల 14న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 20 వరకు కొనసాగనున్నాయి. పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పెద్దఎత్తున సిమెంటు రహదార్లు, డ్రెయిన్లు, తారు, నల్ల కంకర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. అమలాపురం నియోజకవర్గం పరిధిలోని పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. రోడ్లు, మురుగు కాలువలతో పాటు ఇతర పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామాల్లోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పనుల వివరాలు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
అమలాపురం	27	2.83
అల్లవరం	24	2.22
ఉప్పలగుప్తం	09	1.06
ముమ్మిడివరంలో..		
ముమ్మిడివరం	28	2.65
ఐ.పోలవరం	48	4.25
కాట్రేనికోన	50	2.82
తాళ్లరేవు	67	3.43



ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న రహదారి

పనులు ఇలా..

అమలాపురం గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలోని 60 గ్రామాల్లో పల్లె పండగ పేరుతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్లపాటు అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను గుర్తించారు. అమలాపురం నియోజకవర్గంలో సీసీ రోడ్లు నిర్మాణానికి గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ఎమ్మెల్యే ఆనందరావు చొరవ తీసుకున్నారు. దీనికి సంబంధించి మూడు మండలాల పరిధిలో 54 పనులకు రూ.2.44 కోట్లు కేటాయించారు. వీటితో గ్రామాల్లోని వివిధ పనులు చేపట్టనున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో 13.15 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలుతో పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు.



భట్నవిల్లిలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

పనులు వేగంగా చేసేలా..

గ్రామాల్లో పల్లె పండగ పేరుతో చేపట్టే అన్ని పనులను శరవేగంగా చేసేలా కార్యాచరణ ప్రారంభించాం. శంకుస్థాపనలు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం. నాణ్యత ప్రమాణాలతో పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

– పి.ఎస్.రాజ్‌కుమార్, డీఈఈ, పంచాయతీరాజ్

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

అమలాపురం పట్టణం: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమలాపురం పట్టణంలో శ్రీదేవి అమ్మవారు ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ నిమజ్జన ఊరేగింపు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రధాన రహదారుల మీద భారీ ఊరేగింపు చేసి, రాత్రి నిమజ్జనం చేశారు.



శ్రీదేవి అమ్మవారు

మిరుమిట్లు గొలిపే విద్యుత్తు అలంకరణతో జోడు గుర్రాలతో అశ్వనృత్యం, నాగూర్ బ్యాండ్, భూత, బేతాళ నృత్యాలు, కేరళ వాయిద్యాలు, కొండాలమ్మతల్లి కోలాటం, జానపద డప్పుల, కొమ్ముకోయ డాన్స్, సినీ మ్యూజికల్ నైట్, గరగ నృత్యం, గిరిజన థింసా నృత్యం నిర్వహించారు.



అమలాపురంలోని ఊరేగింపులో జానపద నృత్యం



కాట్రేనికోనలో అమ్మవారి వేషధారణలు

కాట్రేనికోన: దసరా మహోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రేనికోనలోని కనక దుర్గ ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారిని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం డప్పు చప్పుళ్లు, మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలే లక్ష్యం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మండలంలోని 13 గ్రామాల్లో రూ.4.26 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌లు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. కేశనకుర్రు, తిళ్లకుప్ప, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, కొమరగిరి, పశువుల్లంక, మురమళ్ల, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం, భైరవపాలెం గ్రామాల సర్పంచుల ఆధ్యక్షతన పల్లె పండుగను నిర్వహించారు.



కేశనకుర్రు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

అమలాపురం గ్రామీణం: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎ.వేమవరం, ఎ.వేమవరప్పాడు, భట్నవిల్లి, జనుపల్లె, పాలగుమ్మి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి బుధవారం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మల్లుల పోలయ్య, పాలమూరి ధర్మపాల్, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండగ కార్యక్రమం నేడు..

కాట్రేనికోన: మండలంలో రూ.2.82 కోట్ల ఉపాధి హామి నిధులతో 48 ప్రాంతాల సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని జేఈ ఫకీర్ అన్నారు. గురువారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కాట్రేనికోనలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ కార్యక్రమాలను శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

దివ్యాంగుల పింఛను అదనంగా రూ.1000 పెంపు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రతి నెలా దివ్యాంగులకు అందిస్తున్న పింఛనుకు అదనంగా రూ.1000 పెంచినట్లు సీఎం రంగసామి ప్రకటించారు. ప్రస్తుతం దివ్యాంగులకు 40-65 శాతం వైకల్యం వరకు అందిస్తున్న రూ.2000 పింఛన్‌ను రూ.3 వేలకు, 66-85 శాతం వరకు ఉన్నవారికి రూ.2500 పింఛను రూ.3500లకు, 80-100 శాతం వైకల్యం కలిగిన వారికి అందిస్తున్న రూ.3500 పింఛను రూ.4500లకు పెంచినట్లు ఆయన తెలిపారు.

గుంతల రోడ్డుకు మోక్షమెప్పుడు!



సావరం-బంటుమిల్లి రోడ్డు బంటుమిల్లి మలుపు వద్ద రహదారి గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని చోదకులు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారి నిర్మించిన దశాబ్దాలు దాటిందని, ఈ రోడ్డు పాడయ్యి పలుచోట్ల గుంతలు పడి, రాళ్లు పైకి లేచాయంటున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ఇటుగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నామని అధికారులు స్పందించి ఈ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. సమస్యను జేఈ ఫకీర్ వద్ద ప్రస్తావించగా రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

అత్యవసరమే అయినా.. ఇప్పుడు ఆపరేషన్ చేయలేం..!

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ప్రసవ సమయం సమీపించడంతో ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించిన నిరుపేద గర్భిణికి చేదు అనుభవం ఎదురైంది. 'మత్తుమందు ఇచ్చే డాక్టర్ ఇంటికెళ్లిపోయారు.. డబ్బులు ఇచ్చి బయట కొన్ని రక్త పరీక్షలు చేయించుకోవాలి. . అత్యవసరమైనా.. ఇప్పుడు శస్త్ర చికిత్స చేయలేం.. ఉదయం వరకు ఆగండి.. లేకుంటే ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిపోండి..' అని వైద్యురాలు సమాధానం చెప్పారని మురమళ్లకు చెందిన గర్భిణి లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు టి.కొత్తపల్లి సామాజిక ఆసుపత్రికి వెళ్తే 2 గంటల సమయంలో డాక్టర్ పరీక్షించి వెంటనే శస్త్రచికిత్స చేయాలని చెప్పారన్నారు. మత్తు మందు వైద్యుడు రావాలంటే రూ.5వేలు ఖర్చు అవుతుందని చెప్పారని లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వలేమని ప్రాధేయపడినా వినకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయినట్లు ఆమె కంటతడి పెట్టారు. డబ్బులు సర్దుబాటు చేసుకుని గురువారం ఉదయం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తామని ఆమె చెప్పారు. దీనిపై ఆసుపత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ దయానాను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. డబ్బులు అడిగారనే ఆరోపణలో వాస్తవం లేదన్నారు. ఉదయం నుంచి నాలుగు శస్త్రచికిత్సలు చేశారన్నారు. మత్తు వైద్యుడు అప్పుడే ఇంటికెళ్లారన్నారు. పూర్తిస్థాయి విచారణ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దు

కాట్రేనికోన: కాట్రేనికోన ఎంపీడీవో కార్యాలయం ఆనుకుని ఉన్న ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాన్ని నిలిపివేయాలని కోరుతూ బుధవారం తహసీల్దారు, ఎంపీడీవో, ఎక్సైజ్ కార్యాలయాల్లో స్థానికులు ఫిర్యాదు అందించారు. స్థానికంగా ఈ దుకాణం ఏర్పాటుచేస్తే స్థానికులు, మహిళలు ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

యానాం, న్యూస్‌టుడే: యానాంలోని జిప్‌మెర్ ఆసుపత్రిలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవం సందర్భంగా బుధవారం రోగులు, సంరక్షకులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం మంది ప్రజలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని.. 15-30 సంవత్సరాల వారే ఎక్కువగా ఉంటున్నారన్నారు. నిద్రలేమి, ఒత్తిడి, ఆల్కహాల్, మాదకద్రవ్యాలను సేవించడం, కోపం, ఒంటరితనం, మితిమీరి చరవాణి వినియోగం వంటివి మానసిక రుగ్మతలకు దారితీస్తాయన్నారు. సుభాషిణి, శ్రీలక్ష్మి, రేఖ, శ్రీను, విఘ్నేశ్వరి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

జేఈ, ఓవర్‌సీర్ పోస్టుల రాత పరీక్ష 27న

యానాం: పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ జూనియర్ ఇంజినీర్ (సివిల్), ఓవర్‌సీర్ ఉద్యోగాలకు ఈ నెల 27న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పుదుచ్చేరిలో ఆరు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని.. అభ్యర్థులు http://recruitment.py.gov.in వెబ్‌సైట్ నుంచి గురువారం హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాల కోసం 0413-2233338 నంబరును ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో సంప్రదించాలన్నారు.

రాయితీపై బాణసంచా విక్రయాలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా దీపావళి సందర్భంగా పోలీసులకు 70 శాతం రాయితీపై బాణసంచా విక్రయానికి ఏర్పాట్లు చేసినట్లు ట్రైనింగ్ స్కూలు సీఐ రఘుపతి ఓ ప్రకటనలో తెలిపారు. 50 రకాల బాణసంచా వస్తువుల కిట్‌ను రూ.1200లకు అందిస్తామని.. ఈ నెల 29 వరకు గోరిమెడులో విక్రయాలు జరుగుతాయని అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందారు. అయినవిల్లి మండలం వెలవలపల్లికి చెందిన నేదునూరి గంగరాజు భార్య సావిత్రి(51)తో గత నెల 23న ముమ్మిడివరంలో హోమియో మందుల కోసం ద్విచక్రవాహనంపై వచ్చారు. బొండాయికోడుతూము వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వీరిని ఢీకొనడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. సావిత్రి అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాకుమార్ తెలిపారు.

పూర్తికాని పనులు.. విద్యార్థులకు వెతలు



వాసాలతిప్పలో పునాది దశలో నిలిచిన అదనపుగదుల నిర్మాణం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

సర్కారు బడుల్లో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. బిల్లులు చెల్లించక పోవడం, సామగ్రి అందించకపోవడం వంటి కారణాలతో పనులు పూర్తికాకుండా మధ్యలోనే ఆగిపోయాయి. పనుల కోసం తెచ్చిన ఇనుము, తదితర సామగ్రి తుప్పుపట్టి నాణ్యత దెబ్బ తింటుంది. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టిపెట్టి ప్రజాధనం వృథా కాకుండా నిర్మాణాలను పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో..

మండల వ్యాప్తంగా 82 పాఠశాలల్లో నాడు-నేడు రెండో విడత పనులు మొదలు పెట్టగా కేవలం రెండు చోట్ల మాత్రమే పూర్తిస్థాయి పనులు జరిగాయి. కొన్నిచోట్ల సగంలోనే పనులు నిలిచిపోయాయి. వాసాలతిప్ప జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం సిమెంటు కొరతతో పునాదుల్లో పనులు నిలిచిపోయాయి. వర్షంనీరు ఆ పునాదుల్లోకి చేరింది. ఎస్.యానాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పలు కారణాలతో మొదలు కాలేదు. నిర్మాణం కోసం తెచ్చిన ఇనుము తుప్పు పడుతుంది. చల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, గోపవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు.



గచ్చకాయలపోరలో పునాది దశ దాటని వైనం

ఎన్.కొత్తపల్లి, మునిపల్లి, భీమనపల్లి తదితర జడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి.

కాట్రేనికోన మండలంలో..

కాట్రేనికోన మండలంలో నాడు-నేడు రెండో విడతలో 50 పాఠశాలల్లో పనులు చేపట్టారు. కందికుప్ప, చెయ్యేరు, సాపేవారిపల్లి, కాట్రేనికోనలో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతులు నిర్మాణాలు నేటికి అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. సాపేవారిపల్లి, గచ్చకాయలపోరలో పునాది దశను నిర్మాణాలు దాటలేదు. నిర్మాణాలకు తెచ్చిన ఇనుము తుప్పు పట్టి పాడవుతున్న పరిస్థితి నెలకొంది. నీలరేవు, జల్లగుంట, రామాలయంపేట, రామస్వామితోట, కాట్రేనికోన మెయిన్, సత్తెమ్మచెట్టు, లచ్చిరాజుచెరువు, దొంతికుర్రు తదితర చోట్ల ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయించాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో సిమెంట్ కొరత, బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచాయని, వచ్చిన వెంటనే పనులు చేయించేలా చర్యలు తీసుకుంటామని కాట్రేనికోన ఎంఈవో-2 వెంకటరమణ పేర్కొన్నారు.

ఓఎన్జీసీ ప్లాంట్‌లోకి సముద్రపు నీరు

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో కెరటాలు తీవ్ర రూపం దాల్చాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో కెరటాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. బుధవారం రాత్రి ఇక్కడి వశిష్ట నూతన టెర్మినల్ లోపలికి సముద్రపు నీరు వెళ్లడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. ఉదయం నుంచి ప్రహరీకి అనుకుని ఉన్న రహదారిని తాకుతున్న అలలు, రాత్రికి మరింత ఉద్ధృతమయ్యాయి.



ఓఎన్జీసీ ప్లాంట్‌లోపలికి చేరుతున్న సముద్రపు నీరు

రహదారులు జలమయం



భాగిర్తమ్మగుడి ఆవరణలో..

కాట్రేనికోన, న్యూస్‌టుడే: రెండురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో మండలంలో పల్లపు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. బుధవారం సైతం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెంచులగరువు, సంతమార్కెట్ రోడ్డు, ఆంధ్రాబ్యాంకు వీధి, రామస్వామితోట, కొప్పిశెట్టివారి వీధి, దేవిసెంటర్, నడవపల్లి, గెద్దనపల్లి, పోరపేట తదితరచోట్ల రోడ్లపై నీరు నిలిచింది. దాంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గణపతి ఆలయం తొలగింపు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని దుడ్డువారి అగ్రహారంలో శ్రీబాలవిద్యార్థి గణపతి ఆలయాన్ని పురపాలిక అధికారులు సోమవారం ఉదయం తొలగించారు. అనుమతి లేకుండా, రోడ్డుకు అడ్డంగా ఉండటంతో తొలగించినట్లు మున్సిపల్ సచివాలయ ప్రణాళికాధికారి ప్రకాశ్ తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఎటువంటి కట్టడాలు చేయకూడదని అధికారులు హెచ్చరించారు.

వినియోగదారుల హక్కులు హరించొద్దు

అమలాపురం గ్రామీణం: స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రీ పెయిడ్ విద్యుత్తు మీటర్లు బిగించడం వినియోగదారుల హక్కులను హరించడమేనని కోనసీమ వినియోగదారుల సంఘం ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి అన్నారు. ఈదరపల్లిలో విద్యుత్తుశాఖ ఎస్ఈ రాజబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. వినియోగదారుల నుంచి అభ్యంతరాలు స్వీకరించకుండానే విద్యుత్తుశాఖ అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని దీనిపై పునరాలోచ చేయాలని కోరారు. కార్యదర్శి ఆదిత్య కిరణ్, బి.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవుల పరిశీలన

రావులపాలెం గ్రామీణం: రావులపాలెం మండలం ఊబలంక, పొడగట్లపల్లి ఇసుక రేవులను బుధవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహం ఏవిధంగా ఉంది.. ఎన్ని రోజుల్లో తవ్వకాలు ప్రారంభించొచ్చు తదితరాలపై చర్చించారు. తహసీల్దారు ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకూ అవస్థలు



నల్లవంతెన బైపాస్‌రోడ్డు పక్కన మూసివేసిన శ్మశానవాటిక

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అంతిమ సంస్కారాలకూ అవస్థలు తప్పడం లేదు. పట్టణంలో మూడు శ్మశాన వాటికలు ఉన్నా, నిర్వహణ కొరవడింది. ముళ్ల పొదలు, మురుగు, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా, పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● ఈడబ్ల్యూఎస్ కాలనీ చివర ఉన్న రోటరీ కైలాస భూమి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. 2017లో రోటరీ మున్సిపల్ కైలాసభూమి ప్రాజెక్టుగా దీన్ని చేపట్టి అందుబాటులో ఉంచారు. ఇక్కడి మరుగుదొడ్లు, వేచి ఉండే గదులు అధ్వానంగా మారాయి. విద్యుత్తు దహనవాటిక నిర్మించేందుకు రూ.1.10 కోట్లు మంజూరు చేశారు. భవనం నిర్మించినా ఇతర సదుపాయాలు కల్పించలేదు. గుత్తేదారులు పనులు నిలిపేశారు. శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

శ్మశాన వాటికల నిర్వహణ గాలికి..

● నల్లవంతెన బైపాస్‌రోడ్డు వద్ద డంపింగ్ యార్డు పక్కన ఉన్న శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. 2015లో సుమారు రూ.8 లక్షలతో మరమ్మతులు చేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దాతలు సమకూర్చిన వస్తువులు నిరుపయోగంగా మారాయి. గతంలో డంపింగ్‌యార్డు నిండిపోవడంతో చెత్తను పక్కనే ఉన్న రోడ్డుపై పడవేసేవారు. కాలక్రమేనా వినియోగించకపోవడంతో అధ్వానంగా మారింది. ఇప్పుడు రహదారి నిర్మించినా వినియోగంలోకి రాలేదు.

● కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్ద శ్మశాన వాటికలోనూ సమస్యలు ఉన్నాయి. కొన్ని అభివృద్ధి పనులు చేయవలసి ఉంది.



అమలాపురంలోని విద్యుత్తు దహనవాటిక యంత్రం

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

నల్లవంతెన బైపాస్‌రోడ్డు శ్మశాన వాటికకు రూ.5 లక్షలతో మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు చేశాం. కైలాసభూమిలో పిచ్చిమొక్కలను తొలగించి, వసతులు కల్పించేలా ఆదేశాలు జారీ చేస్తాం. కొంకాపల్లి శ్మశాన వాటికకు రూ.5 లక్షలు కేటాయించాం. రూ.20 లక్షలతో విద్యుత్తు దహనవాటిక పనులు చేయాల్సి ఉంది. వెంటనే పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేష్, ఏఈ, అమలాపురం మున్సిపాలిటీ

మండపేట

•మండపేట •రామచంద్రపురం

కాలువగట్టుపై చెత్త వేస్తే జరిమానా



ఫ్లెక్సీ ఏర్పాటుచేస్తున్న పంచాయతీ సిబ్బంది

మండపేట గ్రామీణం: మారేడుబాక పరిధి మండపేట- కపిలేశ్వరపురం రహదారి కాలువగట్టువద్ద చెత్త వేస్తే జరిమానా విధిస్తామని కార్యదర్శి ప్రసాదరావు హెచ్చరించారు. స్థానికులకు అవగాహన కల్పిస్తూ పరిసరాలను శుభ్రం చేసేందుకు తాము, పారిశుద్ధ్య సిబ్బంది కృషి చేస్తున్నామన్నారు. అయినా కొందరివల్ల పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇక నుంచి మారేడుబాక జంక్షన్‌ నుంచి వెంకటేశ్వర దిబ్బాపురం ఆలయం వరకు చెత్తను వేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రసాదరావు హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఘనంగా మహబూబ్ సుబానీ గంధోత్సవం

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక రావులపేటలోని హజరత్ మహబూబ్ సుబానీ జండా వద్ద ముస్లిం సోదరులు 34వ గంధోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జండాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రార్థనలు నిర్వహించి మసీదు ఇమామ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



మండపేటలో గంధోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

పాదులు తొలగించారు



ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామం ఎస్సీ కాలనీలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి పచ్చని పాదులు అల్లుకుని తీగలను సైతం తాకుతున్నాయి. దీనిపై ఈనెల 15న ఈనాడులో 'అల్లుకున్న పాదులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత విద్యుత్తు శాఖ ఏఈ డి.రవికుమార్ స్పందించారు. వెంటనే స్తంభానికి అల్లుకున్న పాదులు తొలగింపునకు సత్వర చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ఈనాడు స్పందన

మండపేట గ్రామీణం: తాపేశ్వరం సొసైటీ వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పాదులు అల్లుకున్నాయి. ఈ సమస్యపై 'పాదల్లో నియంత్రిక' ఈనాడులో మంగళవారం చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్, సిబ్బంది స్పందించి నియంత్రికను చుట్టుకున్న పాదులను తొలగించారు. పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

నాగార్జున దూరవిద్య పరీక్షల వాయిదా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఈ నెల 17వ తేదీ నుంచి జరగాల్సిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 1, 3వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.వి.రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అభ్యర్థులు అసౌకర్యానికి గురికాకుండా పరీక్షలు వాయిదా వేసినట్లు దూరవిద్య కేంద్రం పరీక్షల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్ తెలిపారన్నారు. ఇదిలా ఉండగా 2,4 సెమిస్టర్ పరీక్షలు మాత్రం యథావిధిగా జరుగుతాయన్నారు. వాయిదా పడిన పరీక్షలు నవంబరు 17 నుంచి జరుగుతాయని ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆయన వెల్లడించారు.

'మందకృష్ణపై మహాసేన రాజేష్ వ్యాఖ్యలు తగవు'

మండపేట: మాదిగల ఆత్మగౌరవం కాపాడేందుకు వారి అభివృద్ధికి దశాబ్దాల పాటు నిస్వార్థంగా పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగపై మహాసేన రాజేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం మండపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో నిర్వహించిన సమావేశంలో మహాసేన రాజేష్ మందకృష్ణ మాదిగను కించ పరిచే విధంగా మాట్లాడారన్నారు. రాజేష్ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం జాతిని ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తాము సహించబోమని హెచ్చరించారు. సవరపు సతీష్, మండపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బుంగ సంజయ్ తదితరులు

అంగన్‌వాడీలకు సరికొత్త హంగులు

కేంద్ర ప్రభుత్వ పథకంతో మారనున్న రూపురేఖలు

అంగర, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఇటీవల కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను 'సక్షం' (స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంటు) కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 38 సొంత భవనాలున్న కేంద్రాలను సక్షం కింద మార్చారు. వీటిని చిన్నారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరేళ్ల లోపు చిన్నారుల నుంచి గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, పరిరక్షణే ధ్యేయంగా శిశు సంక్షేమ శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు.

ప్రాజెక్టు పరిధిలో ఇలా: మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట గ్రామీణ మండలాల్లో మొత్తం 240 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 38 కేంద్రాలకు సక్షం పథకంలో అభివృద్ధి చేసేందుకు అవకాశం లభించింది. ఆయా కేంద్రాల్లో కల్పించే మౌలిక సదుపాయాలపై ఇప్పటికే అధికారులు సమాయత్తమవుతున్నారు.

మండపేట ప్రాజెక్టు పరిధిలో	కపిలేశ్వరపురం	మండపేట	రాయవరం
అంగన్‌వాడీ కేంద్రాలు	77	94	69
పిల్లలు(ఆరునెలల నుంచి మూడేళ్లు)	1,602	3,099	1,398
పిల్లలు(మూడేళ్ల నుంచి ఆరేళ్లవారు)	1,052	1,898	1,045
గర్భిణులు	337	684	277
బాలింతలు	281	562	234

సక్షం పథకానికి మండలాల వారీగా ఎంపికైన కేంద్రాలు

మండపేట గ్రామీణం	14
రాయవరం	14
కపిలేశ్వరపురం	10
మొత్తం	38

ఇవీ కేంద్రాలు: కపిలేశ్వరపురం మండలంలోని కేదార్లంక 2, వల్లూరు 3, తాతపూడి 1, నల్లూరు 2,3, వెదురుమూడి 1, కాలేరు 3, నేలటూరు 6 కేంద్రాలు, వడ్లమూరు, నాగులచెరువు కేంద్రాలు ఎంపికయ్యాయి. రాయవరం మండలంలో సోమేశ్వరం 2,4,7, రాయవరం, వెదురుపాక, లొల్ల, నదురుబాద, చెల్లూరు, వెంటూరు 1, 2, కూర్మాపురం 2, మండపేట మండలంలో ద్వారపూడి 4, 13, జెడ్.మేడపాడు 12, ఏడిద 13, ఏడిద సీతానగరం 2,3, మారేడుబాక 3, తాపేశ్వరం 4, 5, అర్తమూరు 3, 4, ఇప్పనపాడు 3, పాలతోడు 2 కేంద్రాలను సక్షం పరిధిలో ఎంపిక చేశారు.

కల్పించే సదుపాయాలివే: తల్లీ, బిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదల, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సదుపాయాలను కల్పించనున్నారు. చిన్నారులకు కుర్చీలు, టేబుళ్లు, ఇతర వసతులను సమకూర్చనున్నారు. పోషణ వాటిక పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ మొక్కల పెంపకం చేపట్టి, పండిన వాటితో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారం వండిపెట్టనున్నారు. చిన్నారులను ఆకట్టుకునే విధంగా బోధన చేయడంతో పాటు, ఎల్ఈడీ టీవీని ఏర్పాటుచేసి ఆటపాటల ద్వారా పాఠాలను బోధించనున్నారు. సురక్షితమైన తాగునీరు అందించడం కోసం శుద్ధీకరణ యంత్రాలు అమర్చుతారు. కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు సమకూర్చనున్నారు.



నేలటూరులో చిన్నారులకు విద్యాబోధన

లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహణ

సక్షం పథకంలో ఎంపికైన కేంద్రాలను లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించడానికి వీలుగా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నాం. ప్రాజెక్టు పరిధిలో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ఆధారంగా త్వరలోనే అన్ని రకాల సదుపాయాలను కల్పించనున్నాం. ఈ పథకం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మేలు జరుగుతుంది.

– గజలక్ష్మి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, మండపేట

ఉపాధి నిధులతో పల్లెల్లో ప్రగతి బాట : వేగుళ్ల

రాయవరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నార్జీఎస్ ఉపాధి హామీ నిధులను పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. బుధవారం రాయవరం మండలంలో వెదురుపాక, రాయవరం, వెంటూరు గ్రామాల్లో జరిగిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. నియోజకవర్గంలో పశుపోషకులను ప్రోత్సహించేలా 50 గోకులాల నిర్మాణాలకు రూ.75 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మూడు గ్రామాల్లో రూ.కోటితో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల శంకుస్థాపన చేశారు. స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచులు మల్లిడి అబ్బాయిరెడ్డి, చంద్రమళ్ల రామకృష్ణ, వాసంశెట్టి వెంకట్రావు, డీఎల్‌డీవో శాంతి, ఎంపీడీవో కీర్తి స్పందన కుమారి, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, యరమాటి సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రాయవరంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



వేగాయమ్మపేటలో పాల్గొన్న అధికారులు, గ్రామస్థులు

ద్రాక్షారామ: పల్లెపండుగ- ప్రగతికి అండగా కార్యక్రమంలో భాగంగా బుధవారం వేగాయమ్మపేట, అన్నాయిపేట, వెంకటాయపాలెం, ఉట్రుమిల్లి గ్రామాల్లో నిర్మించబోతున్న సీసీ రోడ్ల శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, ఎంపీడీవో కె.పద్మజ్యోతి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: దేశం గర్వించదగ్గ మేధావి ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా అని ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. బుధవారం ద్రాక్షారామలో కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా మృతికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ సాయిబాబా కోనసీమ జిల్లా అమలాపురంలో పుట్టి డిగ్రీ వరకు ఇక్కడే చదువుకున్నారని, ఉన్నత చదువులు హైదరాబాద్, దిల్లీ యూనివర్శిటీల్లో పూర్తి చేసి అక్కడే అధ్యాపక వృత్తి చేపట్టారన్నారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, గుబ్బల శ్రీను, రేవు నాగేశ్వరరావు, వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబాకు జోహార్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తడి పొడి చెత్తపై అవగాహన

మండపేట: మున్సిపల్ కమిషనర్ రంగారావు ఆదేశాల మేరకు మెప్మా సిబ్బంది తడి పొడి చెత్త వేరు చేయడంపై బుధవారం పలు వార్డుల్లో అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ అందజేసిన మూడు డస్టుబిన్నుల్లో వేయాలన్నారు. వ్యర్థాలు రోడ్డుపై వేయడం వల్ల కాలువలో చేరి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోందన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా ప్లాస్టిక్ కవర్లు వాడరాదని మార్కెట్‌కు వెళ్లేవారు గుడ్డ సంచి తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

పట్టించుకోకుంటే ప్రమాదమే



మండపేట మండలం ఇప్పనపాడు సచివాలయం-2 వద్ద విద్యుత్తు తీగలు బయటకు వచ్చి, మీటరు బోర్డు, కంట్రోలు యూనిట్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారుల చేతికి అందేలా ఉన్న విద్యుత్తు పరికరాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పక్కనే పాఠశాల ఉండటంతో పొరపాటున విద్యార్థులు ముట్టుకునే అవకాశం ఉంది. సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని మీటరు, కంట్రోల్ పెట్టెను పైకి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ఎట్టకేలకు పనుల్లో కదలిక

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు మండపేట మండలంలో కొన్ని గ్రామాల్లో నూతన భవన నిర్మాణాలు చేపట్టి నిధులులేక నిర్మాణపనులు మధ్యలోనే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం మధ్యలో ఆగిన భవనాల నిర్మాణం త్వరితిగతిన పూర్తి చేయాలనే సంకల్పంతో నిధులు ఏర్పాటుచేసి పనులు వేగవంతం చేసింది. అందులో భాగంగా మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామంలో పంచాయతీ కార్యాలయం దగ్గర రూ.25 లక్షల మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టిన రైతు సేవా కేంద్ర నిర్మాణ పనులను గ్రామ సర్పంచి కంచర్ల చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారుడికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమర్‌నాధ్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.



– న్యూస్‌టుడే, ద్వారపూడి

భయపెడుతున్న శునకాలు

మండలంలో శునకాలు ప్రజలను భయపెడుతున్నాయి. మారేడుబాక, తాపేశ్వరం, ఇప్పనపాడు, పాలతోడు, వెలగతోడు, ఏడిదసీతానగరం, ఏడిద, అర్తమూరు గ్రామాల్లో సుమారు 1100 పైగా శునకాలు ఉంటాయని పంచాయతీ కార్యదర్శులు అంచనావేస్తున్నారు. రాత్రి సమయంలో దాడిచేయడం, పలువురిని కరవడం చేస్తున్నాయి. ఈ మధ్యకాలంలో కుక్కలు దాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీనిపై ఈవోపీఆర్డీ దాసరి శ్రీనును వివరణ కోరగా కుక్కలను అడివి ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశవరం పీహెచ్‌సీ వైద్యురాలు లత పేర్కొన్నారు. కుక్క కరిస్తే వెంటనే పీహెచ్‌సీకి రావాలన్నారు. ఆసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ఉద్యోగ మేళాలో 16 మంది ఎంపిక

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మినీ జాబ్ మేళాలో నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 58 మంది విద్యార్థులకు ముఖాముఖి పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. వారిలో 16 మందిని తుది ముఖాముఖి పరీక్షకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో కళాశాల అధ్యాపకులు మహ్మద్ సహజాది బేగం, ఏపీఎస్ఎస్ డీసీ కో ఆర్డినేటర్ ఆర్.రఘువర్మ, ప్లేస్‌మెంట్ అధికారి రాజేంద్రప్రసాద్ సీడాప్-పీవో సురేష్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం, ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు. పట్టణంలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 11కేవీ పట్టణ-1,2 ఓదూరు, చెల్లూరు ఫీడర్లపై మరమ్మతుల కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా పట్టణ ప్రధాన రోడ్డు, రత్నంపేట, హౌసింగ్‌బోర్డు, ముచ్చుమిల్లి, లలితానగర్, ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కలాశాల, మోడరన్ కళాశాల, రామకృష్ణ నగర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రి, ముచ్చుమిల్లి రోడ్డు, గాంధీ ఆసుపత్రి, ఆర్డీవో కార్యాలయం, కవలవారి సావరం, మధ్య నగర్, చప్పిడివారి సావరం, ఆదర్శ ఆసుపత్రి, మార్కెట్ సెంటర్, ఓదూరు, నరసాపురుపుపేట, చోడవరం, ఆక్వా, నూకల మిల్లు, వి.ఎస్.ఎం కలాశాల, అంకం వారి వీధి, గుబ్బలవారి వీధి, మార్కెట్ సెంటర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని ఈఈ ఈ సందర్భంగా కోరారు.

మండల పరిధిలో...

రామచంద్రపురం మండలం ద్రాక్షారామ సెక్షన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ద్రాక్షారామ, అన్నాయిపేట, వెంకటాయపాలెం, భీమేశ్వరాలయం, హసనబాద, కందులపాలెం, గొల్లలచెరువు, బీమక్రోసుపాలెం తదితర ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

పైడితల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామకు చెందిన మాకం కామేశ్వరరావు, అతని కుమారులు రూ.2.40 లక్షల విరాళాన్ని అందజేశారు. బుధవారం ఈ విరాళాన్ని అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణ అధికారికి అందించారు. నగరంలోని పెద్ద చెరువులో బెస్తవారి వలలో అమ్మవారి విగ్రహం ప్రత్యక్షమైందని, వారు విరాళాన్ని ఇవ్వడం సంతోషదాయకమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో కమ్మవీధికి చెందిన బెస్త వారి వల ఉత్సవ సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.



విరాళాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు అందజేస్తున్న కామేశ్వరరావు కుటుంబ సభ్యులు

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి విశ్వకర్మ యువజన కార్యక్రమంలో భాగంగా చేతివృత్తి పనివార్లకు ఇస్తున్న శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం నియోజకవర్గ భాజపా సమన్వయ కర్త దూడల శంకరనారాయణ అన్నారు. బుధవారం గొల్లపాలెంలో కేంద్ర ప్రభుత్వం దోబి పనివారికి 7 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ దపదపాలుగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసకున్న ప్రతి ఒక్కరికీ రూ.15 వేల విలువచేసే ఆధునాతన పరికరాలు అందజేస్తారన్నారు. దీనిని సక్రమంగా వినియోగించుకున్న వారికి రూ.3 లక్షల వరకు రుణాలు పొందేందుకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తరగతుల జిల్లా కోఆర్డినేటర్ శ్రీనుబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆ మూడు రోడ్లు ఇంతే.. బాగుపడవు అంతే

రామచంద్రపురం పట్టణంలో ప్రధానంగా మూడు ప్రాంతాల్లోని రహదారులు అధ్వానంగా మారాయి. గత అయిదేళ్లలో పూర్తిగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పట్టణంలోని రహదారులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రామచంద్రపురం

పరిశీలన

నడక కూడా కష్టమే..



పట్టణ కాకినాడ రోడ్డు నుంచి 1వ వార్డు కొత్తూరు, 2వ వార్డు స్టీల్‌విల్‌పేట, 3వ వార్డు అంకం వారి వీధి, 4వ వార్డు సూర్యానగర్, పిల్లావారి వీధి, 23వ వార్డు త్యాగరాజనగర్, 24వ వార్డు కుమ్మర్ల వీధి, 25వ వార్డు రజకపేట, 26వ వార్డు గుబ్బలవారి వీధి, 27వ వార్డు చింతపల్లి సూరన్న నగర్ ఇలా 9 వార్డుల ప్రజలకు 4,200 కుటుంబాలకు ప్రధాన రోడ్డు రామచంద్రపురం సూర్యానగర్ రోడ్డు. ఇదే రోడ్డులో రెండు ప్రైవేటు విద్యాసంస్థలు, ఒక మున్సిపల్ హైస్కూల్ అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వచ్చే విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ఈ రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి ఉంది. ఇంతటి ప్రధానమైన రోడ్డును దశాబ్ద కాలంగా పట్టించుకోవట్లేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.23లక్షలు కేటాయించామని త్వరలోనే రోడ్డు అభివృద్ధి చేస్తామని అధికారులు గత మూడు నెలలుగా చెబుతూ వస్తున్నారుకాని మొదలు పెట్టలేదు.

రాళ్లుతేలిన దారిలో ఎట్లా..

రామచంద్రపురం పట్టణంలో 6,7 వార్డుల మధ్యలో రెండు వార్డుల ప్రజలకు ఉపయోగమైన రైలుకట్ట రోడ్డు పదేళ్ల క్రితమే సగం రోడ్డు అభివృద్ధి చేసి మిగిలిన రోడ్డును వదిలేశారు. ఆ రోడ్డు ధ్వంసమై ప్రజలకు చాలా ప్రమాదకరంగా మారింది. శీలంవారి సావరం, గణేష్ నగర్, రాజబాబు నగర్ వైఎస్సార్ నగర్, ఇలా పలు ప్రాంతాల ప్రజలు రైలుకట్ట రోడ్డు మీదుగా వెల్ల రోడ్డుకు వెళ్లేందుకు దగ్గర మార్గం. పైగా ప్రధాన రోడ్డు కాకుండా రెండో మార్గం. ఇంతటి ప్రాధాన్యమైన రోడ్డును సంబంధిత అధికారులు స్పందించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నీ గుంతలే..



బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసిన ఈ రోడ్డు 2008లో వేశారు. 16 ఏళ్లు గడవడంతో ప్రస్తుతం గుంతలుగా మారుతోంది. ఈ బీటీ రోడ్డును అభివృద్ధి చేయాలని వైఎస్సార్ నగర్ వాసులు వేడుకుంటున్నారు. ఒక పక్క రోడ్డు పొడవునా గుంతలుగా మారడంతో వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత పురపాలక అధికారులు ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని వేడుకుంటున్నారు.

త్వరలోనే అభివృద్ధి చేస్తాం

పట్టణంలో సూర్యానగర్ రోడ్డుకు ఇటీవలే కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తాం. అలాగే వైఎస్సార్ నగర్‌కు వెళ్లే బీటీ రోడ్డు, రైలుకట్టపై ఉన్న బీటీ రోడ్లను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్డువేసే అభివృద్ధి పనులు చేపడతాం.

- శ్రీకాంత్, మున్సిపల్ డీఈ, రామచంద్రపురం

వ్యక్తి అదృశ్యంపై కేసు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కేదార్లంక శివారు వీధివారిలంకకు చెందిన వీధి సూర్యప్రకాశ్‌రావు ఈ నెల 8న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. సూర్యప్రకాష్ రావు కుటుంబ సభ్యులు అప్పటి నుంచి బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్ల వద్ద వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆయన భార్య వీధి మాణిక్యాంబ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పశువుల కాపరి మృతి

మండపేట: స్థానిక గొల్లపుంత కాలనికి చెందిన పశువుల కాపరి వీర్రాజు(65) స్థానిక గుమ్మిలేరు రోడ్డులో కళాశాల సమీపంలో రోడ్డుపై మృతి చెంది ఉన్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎటువంటి వాహనం ఢీకొనలేదని దెబ్బలు కూడా లేవని స్థానికులు అంటున్నారు. దీనికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.